క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతి



కల్లూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం కల్లూరు అర్బన్‌లో నిర్వహించనున్నారు. 29వ వార్డు పరిధిలోని శరీన్‌నగర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరు కానున్నారు. పార్టీ శ్రేణులతో కలిసి కాటసాని... మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, కార్పొరేటర్లు, అభిమానులు తరలిరావాలని శరీన్‌నగర్ నాయకులు పిలుపునిచ్చారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

పాణ్యం: శ్రావణమాసం ముగుస్తున్న సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం చిన్నపాటి వర్షం మూలంగా భక్తుల రద్దీ తక్కువగా ఉన్నప్పటికీ 11 గంటల నుంచి భారీగా పెరిగింది. క్యూలైన్‌లు నిమిషాల వ్యవధిలో నిండిపోయాయి. సాయంత్రం వరకు భక్తులు రద్దీ కొనసాగింది. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

హైస్కూల్లోకి లద్దగిరి హాస్టల్ విద్యార్థుల తరలింపు



హాస్టల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్

కోడుమూరు రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లద్దగిరి బీసీ వేల్ఫేర్ వసతి గృహం-1,2 విద్యార్థులను స్థానిక హైస్కూల్లోకి ఆదివారం సాయంత్రం అధికారులు తరలించారు. హాస్టల్ భవనం పాతది కావడంతో వర్షాలకు పూర్తిగా తడిచి గోడల్లోకి నీరుచేరి నిమ్ము పట్టింది. దీంతో తహసీల్దార్ వెంకటేష్ నాయక్ లద్దగిరి చేరుకుని హాస్టల్ భవనాలను, వంట గదులను పరిశీలించారు. వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులుతో మాట్లాడి స్థానిక హైస్కూల్లో ఆదివారం రాత్రికి విద్యార్థులకు తాత్కాలిక వసతిని ఏర్పాటు చేశారు.

పంటలను పరిశీలించిన ఏఓ



లద్దగిరిలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: వర్షాల నేపథ్యంలో ఆదివారం మండలంలోని లద్దగిరి, అనుగొండ గ్రామాల్లో ఏఓ రవిప్రకాష్ పంటలను పరిశీలించారు. పంట పొలాలను ప్రతి రోజు పరిశీలించాలని ఈ సందర్భంగా ఏఓ రైతులకు సూచించారు. పొలాల్లో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఏవైనా తెగుళ్లు సోకినట్లైతే వ్యవసాయ అధికారులను సంప్రదించి వెంటనే తెగులు నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీము (సీపీఎస్)ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రెండు దశాబ్దాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాల్లో చీకటి నింపిన సీపీఎస్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలను విరమించుకొని ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. జీపీఎస్, యూపీఎస్ ప్రత్యామ్నాయ విధానాలు ఓపీఎస్‌కు ఏ మాత్రం సరిరావన్నారు. యూపీఎస్ వల్ల ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఓపీఎస్‌ను అమలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. పీఆర్‌టీయూ నాయకులు రామకృష్ణ, నాగేశ్వరయ్య, ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాసులు, వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీడని ముసురు!

- చిరుజల్లులతో దెబ్బతింటున్న పంటలు
- కొర్ర, సజ్జ, పత్తి, ఉల్లి పంటలపై తీవ్ర ప్రభావం



వర్షాలకు దెబ్బతింటున్న వేరుశనగ పంట



వర్షాలకు నల్లగామారిన కొర్ర కంకులు



వర్షాలకు ఎర్రగామారిన పత్తిపైరు

కోడుమూరు రూరల్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడురోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. కోడుమూరు నియోజకవర్గంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. చిరుజల్లులతో మండల కేంద్రాలతోపాటు గ్రామాలు చిత్తడిగా మారాయి. మూడురోజులుగా ముసురు వీడడం లేదు. అయితే చిరుజల్లులు పంటలపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. అధిక వర్షాలతో చేతికొచ్చిన సజ్జ, కొర్ర కంకులు పంటలు దెబ్బతింటున్నాయి. ఈ నెల 21 రాత్రి నుంచి ఉదయం వరకు కురిసిన భారీ వర్షాలకు పచ్చగా మారిన పంటలపై ప్రస్తుతం కురుస్తున్న జల్లులు తీవ్రప్రభావం చూపుతున్నాయి. గతంలో కురిసిన వర్షం అనంతరం తడి ఆరాకా కోద్దామనుకున్న రైతులకు ఇప్పుడు కురుస్తున వర్షాలు అడ్డంకిగా మారాయి. సజ్జ, కొర్ర కంకులు రంగుమారి గింజలు దెబ్బతింటున్నాయి. అదేవిధంగా పత్తి పంట పూత, కాయ నిలవడం లేదు. కంది, ఉల్లి పంటలు వర్షాలకు ఎర్రగా మారి తెగుళ్ల భారీన పడుతున్నాయి. ఆకులు రాలిపోయి చెట్లు ఎర్రగా అవుతున్నాయి. వేరుశనగ పంటకోసి పీకి పొలంలోనే ఉండగా వర్షాలు కురువడంతో కట్టె మొత్తం కళ్లి నల్లగా మారుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గింజ కూడా దెబ్బతింటుందంటున్నారు. కొర్ర, సజ్జ, వేరు శనగ రైతులకు మాత్రం వర్షం తీవ్ర నష్టం చేకూర్చింది. కోడుమూరు మండలంలో ఖరీఫ్ కింద సుమారు 15వేలకు పైగా ఎకరాల్లో రైతులు కొర్ర, పత్తి, వేరుశనగ, కంది, సజ్జ, ఉల్లి తదితర పంటలను సాగు చేశారు.

పంటలకు తెగుళ్లు చుట్టుముట్టాయి



మూడున్నర ఎకరాల్లో ఉల్లి, వేరుశనగ సాగు చేశా. వర్షాలతో ఉల్లి పంటను తెగుళ్ల చుట్టుముట్టాయి. ఉల్లి కొనలు ఎర్రగా మారిపోవడంతో చనిపోతున్నాయి. ఇలాగే మరో రెండు మూడు రోజులు వానలు పడితే ఉల్లి పంట దక్కేటట్లు లేదు. వర్షాల మూలంగా పంటలు బాగా దెబ్బతింటున్నాయి.

– రైతు నరసింహ, బైన్‌దొడ్డి, కోడుమూరు మండలం

రైతులు జాగ్రత్తలు పాటించాలి

వర్షాల మూలంగా పంటలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని. పొలాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి. ఉల్లి పంటకు ఎక్కువ నష్టం కలిగే అవకాశం ఉంది. ఉల్లిలో కుళ్లు తెగులు నివారించేందుకు ఎకరాకు కేజీ చొప్పున కార్బనిడిజం, మెన్‌కోజెబ్ ఉన్న సాఫ్ ఫౌడర్ స్ప్రే చేసుకోవాలి. అలాగే ఆక్సిక్లోరైడ్ 500గ్రాములు పిచికారి చేసుకోవాలి. కంది పొలాల్లో అధికంగా నిలిచిపోయిన నీటిని తీసేయాలి.

– రవిప్రకాష్, ఏఓ, కోడుమూరు

నీట మునిగిన పంట పొలాలు



గడివేములలో మొక్కజొన్న పొలంలో నిలిచిన వర్షపునీరు

గడివేముల: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. మూడు రోజులుగా ముసురు వీడడంలేదు. వర్షాలకు చలిగాలులు తోడయ్యాయి. మండలంలో శుక్రవారం 15.2 మిమీ వర్షం పడింది. శనివారం 22.2 మిమీ, ఆదివారం 46.4 మిమీ సగటు వర్షపాతం నమోదైంది. మొన్నటి వరకూ వర్షాభావంతో ముందుకు సాగని సాగు పనులు ప్రస్తుతం సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే సాగు చేసిన మొక్కజొన్న, మినుము, సోయాబీన్ చేతికొచ్చే సమయంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుడంతో పంటలు దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు. మెట్ట రైతులు మాత్రం సాగుకు సమాయత్తం అవుతున్నారు.

మట్టి మిద్దెల్లో.. బిక్కుబిక్కుమంటూ జీవనం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మట్టిమిద్దెలల్లో నివాసం ఉండేవారు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవలే నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి మట్టి మిద్దెలలో జీవనం చేస్తున్న వారిని గుర్తించాలని ఆదేశాలు జారీ చేసిన సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి మిద్దెలు ఎక్కడ కూలిపోతాయోనని జాగరణ చేస్తున్నారు. మండల కేంద్రమైన గడివేములలోని ఎస్సీ కాలనీలో సరి సుదర్శనం, సరి జయరాజు మట్టి మిద్దెలు వర్షానికి ఇళ్లంతా వర్షపు నీరు కారుతుండటంతోపాటు దెంతెలు కూలడంతో ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా మూల పెద్దమ్మ రహదారిలోని బొంతల రమేష్ మట్టి మిద్దెలు వర్షాలకు ఇంటి పై కప్పు పాక్షికంగా పడిపోయింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.



మట్టి మిద్దెలో వర్షపు నీరు కారుతుండడంతో డబ్బాలు పెట్టిన దృశ్యం

రాకపోకలు బంద్



తొగర్చేడు కుందూబ్రిడ్జిపై ఎవ్వరు వెళ్లకుండా ఎడ్లబండిని అడ్డంగా పెట్టిన దృశ్యం

పాణ్యం: మూడురోజులుగా కురుస్తున్న వార్షాలతో వాగులు, వంటకలు పొంగిపొర్లుతున్నాయి. ఈ మేరకు ఆదివారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి కుందుపరివాహక గ్రామాలలో పర్యటించారు. అప్రమత్తంగా ఉండాలని ఆయా గ్రామాల ప్రజలకు సూచించారు. తొగర్చేడు గ్రామం వద్ద కుందూనదిపై నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. బ్రిడ్జికి అడ్డంగా ఎడ్లబండిని అడ్డగా ఉంచారు. అలాగే రాయపాడు-గగ్గటూరు గ్రామాల మధ్య ఉన్న మునుగుందువాగు బ్రిడ్జిపై నీటి ప్రవాహం ఎక్కువైంది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అనుపూరు చుట్టూ కుందూనది నీరు చేరడతో ప్రజలు బయటకు రాలేదు. అప్పటికే బయటికి వెళ్లిన ప్రజలు సైతం బైక్‌లను కొర్రవాగు వద్ద ఉంచి మూడు అడుగుల మేరా ప్రవహిస్తున్న నీటిలో అతికష్టంగా ఇళ్లకు చేరుకున్నారు. మండలంలో నాలుగు మట్టిమిద్దెలు కూలిపోయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



పాణ్యంలో కూలిన మట్టిమిద్దె

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తొగర్చేడు గ్రామం వద్ద కుందూ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేంద్రకుమార్‌రెడ్డి

పాణ్యం: వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నరేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. కుందూ పరివాహక గ్రామాలను ఆదివారం ఆర్ఐ మహేశ్వరరెడ్డితో కలిసి తహసీల్దార్ పరిశీలించారు. తొగర్చేడు గ్రామం వద్ద కుందూ ప్రవాహాన్ని పరిశీలించిన ఆయన వాగులు ఉధ్రుతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రత్యేకించి కుందూపరివాహ గ్రామాలైన తొగర్చేడు, మద్దూరు, అనుపూరు, గగ్గటూరు గ్రామాల ప్రజలు బ్రిడ్జిలపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు రాకపోకలు సాగించొద్దని సూచించారు. నదీ ప్రవాహాల వద్ద సెల్ఫీ విన్యాసాలు చేయొద్దని, ప్రాణాల మీదకు తెచుకోవద్దని హెచ్చరించారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



జెండా ఆవిష్కరిస్తున్న రైతు సంఘాల నాయకులు

కోడుమూరు రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రైతులకు తక్షణమే రూ.20వేల పెట్టుబడి సాయాన్ని అందించాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. రైతుల కోరికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కోడుమూరులో సీపీఐ నాయకులు జెండా అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని, నేటికీ పెట్టుబడి సాయం అందజేయకపోవడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. తెలంగాణలో ప్రకటించిన విధంగా ఏపీలోనూ కూటమి ప్రభుత్వం రూ.2లక్షలు రైతు రుణమాఫీ చేయాలని, రూ.2లక్షల వరకు వడ్డీలేని రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘాల నాయకులపై పెట్టిన కేసులను కేంద్రం వెంటనే ఎత్తివేయాలని, 50ఏళ్లు నిండిన ప్రతి రైతుకు రూ.10వేల పింఛన్ ఇవ్వాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి తక్షణమే పంట నష్టపరిహారాన్ని అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, రైతు సంఘాల నాయకులు లక్ష్మయ్య, రంగడు, మునిస్వామి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

10న చాకలి ఐలమ్మ వర్ధంతి సభ

కర్నూలు(సెంట్రల్): వీరనారి చాకలి ఐలమ్మ, సత్తెనపల్లె రామకృష్ణ వర్ధంతి కార్యాక్రమాన్ని సెప్టెంబర్ 10వ తేదీన నిర్వహించనున్నట్లు ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ తెలిపారు. ఆదివారం ఏపీ రజక వృత్తిదారుల సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఐలమ్మ, రామకృష్ణ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శేషాద్రి, రాముడు, జయమ్మ పాల్గొన్నారు.



నంద్యాల రోడ్డు నుంచి ఉన్న వంద అడుగుల రోడ్డు ఖాళీ స్థలంలో నిలిచిన వర్షపు నీరు

చినుకు పడితే అంతే!

కల్లూరు: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు జలమయం అయ్యాయి. కల్లూరు అర్బన్ పరిధిలోని రోడ్లు, వీధులు చిత్తడిగా మారాయి. నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని ఖాళీ స్థలాలు కుంటలను తలపిస్తున్నాయి. అలాగే నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్ రోడ్డుపై వర్షందాటికి గుంత ఏర్పడింది. జోహరాపురం రోడ్డు వెళ్లే రోడ్డు ప్రారంభంలో గుంతల ఏర్పడి వర్షం నీరు నిలించి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గుత్తి పెట్రోల్ బంక్ సర్కిల్, 29వ వార్డు పరిధిలోని 44వ జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డులో నిలిచిన వర్షం నీరు మడగును తలపిస్తోంది. చినుకు పడితే చిత్తడే అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.



నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ఖాళీ స్థలంలో నిలిచిన వర్షపు నీరు



నంద్యాల చెక్‌పోస్టు నుంచి జోహరపురం వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కుల వివక్షతోనే దాడి

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గోవింద్‌నాయక్‌పై కుల వివక్షతో డిపార్టుమెంటు ఉద్యోగులే దాడి చేసి ఆయన ఆత్మాభిమాన్ని దెబ్బతీయడం దారుణమైన విషయమని పశుసంవర్ధక శాఖ ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్లు సీహెచ్ కృష్ణారావు, బొడ్డుప్రసాద్ వాపోయారు. నంద్యాల డీపీహెచ్‌ఓపై జరిగిన దాడిని ఉమ్మడి జిల్లా పశుసంవర్ధక శాఖ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం ఆదివారం రైల్వేస్టేషన్ సమీపంలోని హోటల్‌లో సమావేశం నిర్వహించి తీవ్రంగా ఖండించింది. వారు మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంటనే విచారణ కమిటీని నియమించి సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. కులవివక్షతకు గురైన డీపీహెచ్‌ఓకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. నీతి, నిజాయితీతో పనిచేస్తున్న నంద్యాల డీపీహెచ్‌ఓపై నిరాధార ఆరోపణలు చేయడం, అగ్రవర్ణ ఉద్యోగులు దాడికి పాల్పడడం సహించరాని విషయమన్నారు. డాక్టర్ గోవింద్‌నాయక్‌పై కుల వివక్షను ఆపకపోతే అన్ని శాఖల ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు. అధికారులు రవిబాబు, కమలాకర్, ప్రవీణ్, శ్రీనివాసులు,మనోజ్, కిశోర్, దినకర్, వికాస్, భువన, శ్రుతకృర్తి, పలువురు ఏడీలు, వీఏఎస్‌లు తదితరులు పాల్గొని డీపీహెచ్‌ఓకు సంఘీభావం ప్రకటించారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

పాణ్యం: జోరుగా వర్షం కురుస్తున్నందున ఉన్నతాధికారులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారని ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి స్కూల్‌కు రావడానికి విద్యార్థులు పడకూడదని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: జోరుగా వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి ఆదివారం ప్రకటనలో సూచించారు. జడివాన మూలంగా పాతమిద్దెలు కుంగే ప్రమాదం ఉందని, సురక్షిత ప్రాంతాలలో ఉండాలన్నారు. వర్షం కురిసే సందర్భంలో విద్యుత్ స్తంభాలు, చెట్ల దగ్గర వెళ్లొద్దన్నారు.

సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

కర్నూలు కల్చరల్: సమాజ శ్రేయస్సుకు కంకణ బద్దులు కావాలని ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సూచించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహారాజ భోగ నివేదన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణతో పాటు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే ధాతృత్వ గుణం పెరుగుతుందన్నారు. భారత భాగవతంను పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఈ గ్రంథాలు మానవ మనుగడకు మార్గదర్శకాలు అని వివరించారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): భారీ వర్షాల నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఎలక్ట్రికల్ సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండి విద్యుత్ సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది, అత్యవసర విభాగాలైన క్యాజువాలిటీ, గైనిక్, పీడియాట్రిక్ విభాగాల వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రి పవర్‌స్టేషన్‌ను సందర్శించిన అనంతరం పవర్‌స్టేషన్, జనరేటర్స్‌లో డీజిల్ గురించి ఆరా తీశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ సిబ్బందిని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఎలక్ట్రికల్ సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. వైద్యులు అప్రమత్తంగా ఉండి వైద్య సేవలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఊపిరితిత్తుల సమస్యలకు అత్యాధునిక చికిత్సలు




సదస్సుకు హాజరైన వైద్యనిపుణులు

కర్నూలు(హాస్పిటల్): ఊపిరితిత్తుల సమస్యలకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని వైద్య ప్రముఖులు చెప్పారు. ఆదివారం కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో లంగ్స్ అటాక్ పేరుతో కంటిన్యూస్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) నిర్వహించారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ ఆసుపత్రి, కర్నూలు కిమ్స్ ఆసుపత్రుల సహకారంతో కర్నూలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఊపిరితిత్తుల సమస్యలకు చికిత్స, అత్యాధునిక వైద్య విధానాలు, మందులు, వాటితో రోగులకు ఎలా ఊరట లభిస్తుందన్న విషయాలను వివరించారు. కర్నూలు కిమ్స్ నుంచి డాక్టర్ జి.సుధాకర్, వెంకటచలమయ్య, కొండాపూర్ కిమ్స్ - శుభకర్ నాదెళ్ల, అనంతపురం ఆస్పత్రి నుంచి డాక్టర్ యశోవర్ధన్ నిర్వాహకులుగా వ్యవహరించారు. కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి, అనంతపురం, బళ్లారి, రాయచూరు, హైదరాబాద్, మేడ్చల్ తదితర ప్రాంతాల నుంచి వైద్య నిపుణులు హాజరై 150 మంది జూనియర్ వైద్యులు, పీజీ విద్యార్థులకు చికిత్సా పద్ధతులపై అవగాహన కల్పించారు. కర్నూలు కిమ్స్ సీఓఓ డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులను ఏటా నిర్వహిస్తామని చెప్పారు. టీబీ గుర్తింపు, సత్వర చికిత్స, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ లాంటి సమస్యలకు చికిత్సా విధానాన్ని వివరించారు. ఐఎంఏ కర్నూలు ప్రెసిడెంట్ డాక్టర్ రామచంద్రనాయుడు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ, ట్రెజరర్ డాక్టర్ కె.మాధవీశ్యామల, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్, డాక్టర్ జి.శారద పాల్గొన్నారు.

ఉరుకుంద 'బొమ్మ' కనువిందు !

- ఆకట్టుకుంటున్న ఏడవ తరగతి విద్యార్థి గీసిన చిత్రాలు



ఉరుకుంద గీసిన ఉగ్రనరసింహుడి చిత్రం



ప్రకృతి చిత్రం ...



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం



ఆంజనేయ, బాలరాముడి చిత్రలను చూపుతున్న ఉరుకుంద

మండల కేంద్రం సి.బెళగల్లోని బీసీ హాస్టల్ విద్యార్థి ఉరుకుంద గీసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఉరుకుంద వేసిన చిత్రాలు చూపరులకు కనువిందునిస్తున్నాయి. ఎలాంటి శిక్షణ లేకున్నా ఈ విద్యార్థి సొంతంగా గీస్తున్న దేవతలు, పకృతి చిత్రాలను ప్రశంసిస్తున్నారు కళా ప్రేమికులు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కేవలం పెన్సిల్, వాటర్, స్కెచ్ పెన్నులతో సుందరంగా సునాయసంగా చిత్రాలను గీస్తూ అబ్బురపరుస్తున్నాడీ విద్యార్థి. ఈ విద్యార్థి గీసిన చిత్రాలలో ఆధ్యాత్మికత సైతం ఉట్టిపడుతుంది. అయోధ్యా రామాలయం, బాలరాముడు, ఆంజనేయుడు, శ్రీ సీతారామ లక్ష్మణ చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం ఆకర్షణీయంగా ఉంది.

– సి.బెళగల్